


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కర్నూలు నంద్యాల

శనివారం| 22 నవంబరు 2025

పేజీలు 8


## పెను ప్రమాదంగా

# డివైడర్ ద్వారం



ప్రమాదంగా ఉన్న డివైడర్ ద్వారం

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** కర్నూలు సర్వజన వైద్యశాల బయటకు వచ్చే గేట్ వద్ద ఎదురుగా రోడ్డు డివైడర్‌లో ఏర్పాటు చేసిన అనధికారిక చిన్న ద్వారం ప్రజల ప్రాణాలకే పెను ప్రమాదంగా మారుతోంది. ఆసుపత్రి నుంచి అవతలి వైపు ఉన్న మెడికల్ షాపులు, ఇతర అవసరాల కోసం ప్రజలు ఈ అడ్డదారిని ఉపయోగిస్తున్నారు. అత్యవసరంలో ఉన్న రోగులు, బంధువులు, పిల్లలు హడావుడిగా ఇరుమార్గాల్లో వచ్చే వాహనాల వేగాన్ని గమనించకుండా రోడ్డు దాటే ప్రయత్నంలో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. దానికి కారణం ఈ మార్గంలో ఎటువంటి భద్రత ప్రమాణాలు, స్పీడు బ్రేకర్లు, రోడ్ క్రాసింగ్ లైన్లు, సిగ్నల్స్ లేదా ట్రాఫిక్ నియంత్రణ సిబ్బంది లేకపోవడం వల్ల ఇది ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. గతంలోనూ ఈ మార్గంలో రెండు, మూడు ప్రమాదాలు జరిగాయి. హైవే తరహా వేగంతో వచ్చే వాహనాలకు పాదచారులను గమనించడం కష్టమవుతోంది.

మిగతా 2లో

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో:** ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతన్నను లోన్ రికవరి ఎజెంట్ నట్టేట ముంచారు. రైతులు కోటక్ బ్యాంక్‌లో లోన్‌తో ట్రాక్టర్లను తీసుకున్నారు. తీసుకున్న లోను చెల్లింపులో భాగంగా థర్డ్ పార్టీ లోన్ రికవరి ఎజెంట్ అస్లాం రైతుల నుంచి నగదును వసూలు చేశారు. నగదును బ్యాంకుకు చెల్లించకుండా ఉడాయించారు. తీసుకున్న లోన్ డబ్బులు చెల్లించాలని రైతులను బ్యాంకు అధికారులు నోటీసులు పంపడంతో బాధిత రైతులు అవాక్కయ్యారు. బాధిత రైతులు కోటక్ బ్యాంక్ వద్దకు నిరసనకు దిగారు. రికవరి ఎజెంట్ థర్డ్ పార్టీకి చెందిన వ్యక్తి అని చెబుతూ లోన్ నగదు చెల్లించాలని బ్యాంకు అధికారులు చావు కబురు చల్లగా చెప్పారు. ఆగ్రహించిన బాధిత రైతులు బ్యాంకు తాళం వేశారు. లోన్ రికవరి ఎజెంట్‌తో మోసపోయిన తమకు న్యాయం చేయాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

మిగతా 2లో

**కోటక్ బ్యాంక్‌కు తాళం వేసిన బాధిత రైతులు**
**రూ.40 లక్షలతో ఉడాయించిన ఎజెంట్ అస్లాం**
**న్యాయం చేయాలంటున్న అన్నదాతలు**

## రైతులను ముంచిన

# లోన్ రికవరీ ఎజెంట్



థర్డ్ పార్టీ రిక వరి ఎజెంట్ అస్లాం



కోటక్ బ్యాంకు ఎదుట రైతుల నిరసన

# మత్స్య సంపద పెంచి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపాలి

- నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా
- ప్రపంచ మత్స్యశాఖ దినోత్సవంలో కలెక్టర్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేకతలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌లో జిల్లా మత్స్యశాఖ వారి ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యశాఖ దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. నంద్యాల వ్యవసాయ అనుబంధ

మిగతా 2లో



ప్రపంచ మత్స్యశాఖ దినోత్సవ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

## సిఐ జె.శంకరయ్య

# పోలీస్ శాఖ నుండి తొలగింపు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ ఉత్తర్వుల మేరకు కర్నూలు విఆర్‌లో విధులు నిర్వహిస్తున్నసిఐ జె.శంకరయ్యను క్రమశిక్షణ చర్యల నిమిత్తం పోలీస్ శాఖ సర్వీస్ నుంచి తొలగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ విధుల నుండి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.



డిస్మిస్ అయిన సిఐ జె.శంకరయ్య

# 24 నుండి మీ కోసం రైతన్న

- ప్రపంచ మత్స్యశాఖ దినోత్సవంలో కలెక్టర్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న మీ కోసం రైతన్న కార్యక్రమాన్ని ఈనెల 24వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

మిగతా 2లో



వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

# రైతాంగానికి సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి
- జీడీపీ కుడి కాలువకు సాగునీటిని విడదల చేసిన ఎమ్మెల్యే



పూజలు చేసి జీడీపీకి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

**గోనెగండ్ల, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని రైతాంగానికి పంటలు రైతులుచేతకి అందేవరకు సాగు నీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం గాజులదిన్నె ప్రాజెక్టులోని నీటికి గంగా పూజ చేసి ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా ఆయకట్టు రైతులకు సాగు నీటిని ఎమ్మెల్యే బీవీ విడుదల చేశారు. కుడి కాలువకు 100 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన రైతులనుద్దేశించి మాట్లాడుతూ

మిగతా 2లో

సూర్య www.suryaa.com



# మత్స్య సంపద పెంచి మత్స్యకారుల జీవితాలలో వెలుగులు నింపాలి

(మొదటి పేజీ తరువాయి)

శాఖలపైన ఆధారపడిన జిల్లా మన జిల్లాలో ఎక్కువగా హార్టికల్చర్, లైవ్‌స్టాకు, అగ్రికల్చర్ తరువాత ఆక్వారంగం ద్వారా జిల్లాకు జిడిపి ఎక్కువగా వస్తుందన్నారు. జిల్లాలో 65వేల మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తి ఉందన్నారు. ఈ ఏడాది 80వేల మెట్రిక్ టన్నులకు పెంచాలన్న ఆలోచనతో జిల్లా యంత్రాంగం ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. జిల్లాలో 330 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు ఉన్నాయని కాని 110 ట్యాంకులలో చేపల పెంపకం జరుగుతోందని చేపల పెంచకం రిజర్వాయర్లు చెరువుల ద్వారా పెంచితే మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి పెరిగి జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ దిశగా చెరువులలో మరింత చేపల పెంపకం చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చేపపిల్లల ఉత్పత్తిని మన జిల్లాలోనే జరిగిన మత్స్యకారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి కుటుంబంలో ఒకరైన విద్యావంతులు ఉండాలని ప్రతి కుటుంబం ఉన్నత జీవన ప్రమాణాలతో గడపాలంటే మన కులవృత్తినే మన సంప్రదాయ వృత్తి అనుకుని ఎప్పటికీ మరిచిపోకూడదన్నారు. 50సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు పెన్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వ నియమ నిబంధనలు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటుందన్నారు.

# రైతాంగానికి సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)




చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బివి.జయ నాగేశ్వరరెడ్డి

ఈ ఏడాది రబీ సీజన్లో ఆయకట్టు రైతులకు సాగు నీరు విడుదల చేస్తున్నామని ప్రాజెక్టులో 3 టీఎంసీ నీరు ఉన్నందుకు ప్రస్తుతం 13వేల ఎకరాలకు సాగునీరు విడుదల చేస్తున్నామన్నారు. పంటలు రైతుల చేతికి అందే వరకు సాగు నీరు అందిస్తామన్నారు. అనుమతులు వచ్చిన వెంటనే ఆర్డీఎస్, గుండ్రేవుల పనులు చేపడతామన్నారు. గత వైసీపీ పాలనలో ముందుచూపులేకుండా అధికారులు, నాయకులు తీసుకున్న నిర్ణయాలవల్ల జీడీపీ సాగు నీటి ప్రాజెక్టు కాస్తా తాగునీటి ప్రాజెక్టుగా మారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ప్రాజెక్టుకు వరదనీరు వచ్చి చేరడం హంద్రీనీవా, ఎల్లెల్సీ నీరు చేరడంతో ప్రాజెక్టు కింద సాగు భూములు కళకళలాడుతున్నాయని అదే వైసీపీ పాలనలో బీడు భూములుగా ఉండేవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ బాలచం ద్రరెడ్డి, ఈఈ పాండురంగయ్య, డీఈ సుబ్బరాయుడు, ఏఈ మహమ్మద్ ఆలీ, ఉగ్రనరసింహుడు, టీడీపీ నాయకులు తిరుపత్యనాయుడు, రామాంజినేయులు, బేతలబడేసా, మ రళినాయుడు. జీడీపీ సాగునీటి సంఘం అధ్యక్షుడు మల్లికార్జునగౌడు, రామనరసప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.



నీటిలో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే,టీడీపీ నాయకులు,అధికారులు

**రాయలసీమకు ఇక్కడి నుంచే చేప పిల్ల సరఫరా: బీవీ జయనాగేశ్వరరెడ్డి**

**ఎమ్మెల్యే:** రాష్ట్రంలో కోనసీమలో మాదిరి చేపపిల్లలను తయారు చేసి గాజులదిన్నె ప్రాజెక్టులోని మత్స్య సంఘం నుంచి రాయలసీమాలోని అన్ని జిల్లాకు చేప పిల్లను తయారు చేసి పంపిణీ చేసేవిధంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ మత్స్య దినోత్సం సందర్బంగా మన చెరువు మన సీడ్ పథకం కింద గాజులదిన్నె ప్రాజెక్టు లోని పాండ్స్లో గాజులదిన్నె మత్స్యకార్మికులు స్వంత ఖర్చులతో తయారు చేసుకున్న 25 లక్షల చేప పిల్లలను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, మత్స్య శాఖ డీడీ రంగనా ధబాబు వదిలారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మత్స్య సంఘం స్వంతంగా రూ. 5లక్షలో తయారు చేసుకున్న చేప పిల్లలు నేడు రూ.30 లక్షలు విలువ చేస్తున్నాయని తెలిపారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఎంపిక కాబడిన గాజులదిన్నె మత్స్యసహాకార సంఘం, సీబెళగల్, చిన్న తుంబళం, సంఘాలకు మేనేజ్మెంట్ కాస్ట్ కింద ఒక్కొక్కరికి రూ. 2,54000 చెక్కులను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి నాగరాజు, జిల్లా మత్స్య కార్పోరేషన్ డైరెక్టర్ రామాంజినేయులు, పోతుల శేఖర్, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో మణిమంజరి, సిబ్బంది పాల్గొన్నారు.

# శంకరమ్మ మృతికి పలువురు నివాళులు

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** ఆదోని సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి లక్ష్మన్న మాతృమూర్తి సీపీఎం పార్టీ మహిళా నాయకురాలు శంకరమ్మ గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె అంత్యక్రియలు శుక్రవారం ఆదోనిలో జరిగాయి. విషయం తెలుసుకున్న సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాధాకృష్ణ, కే వెంకటేశులు, కె.వి నారాయణ, ఆనంద్ బాబు, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు రామాంజనేయులు, ఈరన్న, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి లింగన్న, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వీరారెడ్డి, రామాంజనేయులు, మునెప్పలు మృతురాలి నివాసానికి చేరుకొని, ఆమె పార్థివ దేహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, బంధువులు, స్నేహితులు శంకరమ్మ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



శంకరమ్మ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

# సొంత నిధులతో రోడ్డు మరమ్మత్తులు

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** నంద్యాల మండల పరిధిలోని చాబోలు గ్రామంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి మండ్ల గుర్రప్ప సొంత నిధులతో రోడ్డు మరమ్మత్తులు చేపట్టారు. మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదేశాలతో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్, రాష్ట్ర టీడీపీ యువనాయకుడు ఫయాజ్ ఆధ్వర్యంలో ఆయన మైనార్టీ కాలనీలో అధ్వాన్నంగా ఉన్న రోడ్డుకు మరమ్మత్తు పనులను చేపట్టారు. ఆ ప్రాంత మైనార్టీలు రోడ్డుపై నడిచేందుకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మండ్ల గుర్రప్ప దృష్టికి తీసుకొని వచ్చారు. సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్ళడంతో మరమ్మత్తు పనులు చేపట్టాలని చెప్పడంతో ఆ మేరకు మరమ్మత్తులను చేపట్టారు.



మైనార్టీ కాలనీలో అధ్వాన్నంగా ఉన్న రోడ్డు



మరమ్మత్తు పనులు చేపట్టుతున్న దృశ్యం

# రైతులను ముంచిన లోన్ రికవరీ ఎజెంట్

(మొదటి పేజీ తరువాయి)

నంద్యాలలోని కోటక్ బ్యాంక్‌లో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన రైతులు బ్యాంక్‌లో లోను తీసుకొని ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. ప్రతి నెల లోను నగదును చెల్లిస్తూ వస్తున్నారు. లోన్ రికవరిని బ్యాంకు అధికారులు మూడవ పార్టీకి అప్పగించారు. అందులో భాగంగా నంద్యాలలో అస్లాం రికవరి ఎజెంట్‌గా పని చేస్తున్నారు. రైతులు ప్రతి నెల చెల్లిస్తూ వచ్చారు. అజెంట్‌కు నగదు, ఫోన్ పే, గూగుల్ పేలో చెల్లించారు. ఇదే సమయంలో బ్యాంకు నుంచి మీ లోను చెల్లించాలని నోటీసులు అందడంతో రైతులు అవాక్కయ్యారు. అస్లాంతో ఫోన్లో మాట్లాడిన రైతులకు ఆయన నుంచి సరైన సమాధానం రాకపోవడంతో విస్తుపోయారు. ఈ నేపథ్యంలో బాధిత రైతులు శుక్రవారం బ్యాంకు వద్దకు వచ్చి అధికారులతో మాట్లాడారు. రికవరి బాధ్యత థర్డ్ పార్టీకి ఇచ్చామని, త మకు సంబంధం లేదని, మీ బకాయిలు అలాగే ఉన్నాయని చెబుతూ ఖచ్చితంగా చెల్లించాలని చెప్పడంతో రైతులు నిరసనకు దిగారు. బ్యాంకు తాళం వేశారు. సుమారు 25 మంది రైతుల నుంచి రూ.40లక్షల దాకా అస్లాం వసూలు చేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. లోన్ తీర్చడానికి రైతులు ఎంతో కష్టపడి సంపాదించిన కట్టిన డబ్బులతో అస్లాం పరార్ అయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. అస్లాం నుంచి డబ్బులు వసూలు చేసిన న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి నిరసనను విరమింప చేశారు. బాధితల నుంచి ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేసిన పోలీసులు అస్లాం కోసం గాలిస్తున్నారు.




అస్లాంకు డిజిటల్ చెల్లింపు

# పెను ప్రమాదంగా డివైడర్ ద్వారం

(మొదటి పేజీ తరువాయి)

అధికారుల అలసత్వం వలన ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు ఈ ప్రమాదకరమైన ద్వారంపై దృష్టి పెట్టకపోవడంతో ప్రజల నుండి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదాలను నివారించడానికి అధికారులు తక్షణమే ద్వారం మూసివేయడం లేదా భద్రతా ఏర్పాట్లు, ఒకవేళ ద్వారం ఉంచదలిస్తే తప్పనిసరిగా ట్రాఫిక్ నియంత్రణ సిబ్బందిని నియమించడం, వాహనదారుల వేగాన్ని తగ్గించేందుకు హెచ్చరిక బోర్డులు, రంబ్లింగ్ స్ట్రిప్స్(స్పీడ్ బ్రేకర్లు) ఏర్పాటు చేయడం వంటివి చేయాలి. ప్రజలు సురక్షితమైన యూటర్న్ పాయింట్లు లేదా జీబ్రా క్రాసింగ్‌లను మాత్రమే ఉపయోగించేలా అవగాహన కల్పించాలి. ప్రాణాల విలువ తెలియని అధికారుల అలసత్వం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# 24 నుంచి మీ కోసం రైతన్న

(మొదటి పేజీ తరువాయి)

ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా మీ కోసం రైతన్న కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రైతులకు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్ సాంకేతికతల వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్ అవకాశాలు, ప్రభుత్వ మద్దతు వంటి ఐదు కీలక అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లోని రైతులను కలిసి రోజుకు 30మంది రైతులకు సీఎం సందేశ లేఖను చదివి వినిపించడం, ఆయా పథకాలపై కరపత్రాలు అందించడం, రైతుల ఫోటోలను వ్యవసాయ సమాచార యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. 24 నుంచి 29వరకు కొనసాగి అనంతరం రైతుల సమస్యలను సేకరించి డిసెంబర్ 3న రైతు సేవా కేంద్రాల్లో వర్క్‌షాప్ నిర్వహిస్తామని తెలిపారు.

## ఆరోగ్యవంతమైన జీవితం కోసం శరీరానికి వ్యాయామం అవసరం

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** ఆరోగ్యవంతమైన జీవితం కోసం రోజువారి జీవితంలో శారీరక వ్యాయామం క్రీడలు ఎంతో అవసరమని శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం సురేష్ అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న శ్రీ చైతన్య కె4బ్రాంచ్ పాఠశాలలో క్విట్ ఇండియా ప్రోగ్రాం పాఠశాల ప్రిన్సిపల్ సుహాసిని ఆద్వర్యలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ చైతన్య పాఠశాల ఏసిఎం సురేష్ ఆర్‌ఐ రామాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్బంగా వారు విద్యార్థులతో మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమం 2019 ఆగస్టు 29న కెఎల్ దివాస్ నాడు ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించాడని, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్బంగా ఏటా ఖేల్ దివాస్ జరుపుకుంటున్నారన్నారు. క్రీడలను అభ్యాసం చేయడం ద్వారా ఆరోగ్యంగా దృడంగా ఉంటారన్నారు. అనంతరం శ్రీ చైతన్య విద్యార్థులు ర్యాలీగా వెళ్లి కాలనీలోని ప్రజలకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## ఆదోని నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

**ఆదోని, మేజర్ న్యూస్ :** ఆదోనిని జిల్లా చేయడమేకాకుండా నియోజకవర్గాన్ని నాలుగు మండలాలుగా చేసి నియోజక అభివృద్ధికి సహకరించాలని బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు నఖాతే శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదోని నియోజకవర్గంలో 42గ్రామాలు కలిపి ఒకే మండలంగా ఉండడం వలన ఆదోని నియోజకవర్గానికి సరైన నిధులు రాక అభివృద్ధిలో వెనుక బడిపోతుందని, కాబట్టి ఆదోని నియోజకవర్గాన్ని 4 మండలాలుగా విభజన చేసి, ఆదోని కేంద్రంగా జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం రాఘవేంద్రాచార్, వెల్లాల మధుసుధన్ శర్మలు మాట్లాడుతూ, ఆదోని జిల్లా అయినప్పుడు మాత్రమే విద్య, వైద్య, వ్యవసాయ అభివృద్ధిపాటుగా ప్రజల జీవనశైలిలో మార్పులు వస్తాయని, అందువలన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే న్యాయమైన డిమాండ్‌ను నేరవేర్చాలని కోరారు. ఈ రిలే నిరాహారదీక్షలో బ్రాహ్మణ సంఘం నాయకులు మఠం రామచంద్ర, దేశాయ్ గిరి, భీమసేనాచార్, మఠం శంకరశాస్త్రీ, కరణం మంజునాథ్, వైద్యం నాగరాజు, మధుసూదన్ రావు, గరుడాద్రి దత్తాత్రేయ శర్మ, కమలనాభ శర్మ, తదితరులు పాల్గొన్నారు.


దీక్షలో మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



ఫైల్ ఫోటో , ప్రమాదం జరిగిన దృశ్యం

**మిడుతూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని తలముడిపి గ్రామం వద్ద గుర్తుతెలియని వాహనం బైక్ ను ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ సిహెచ్ ఓబులేష్ తెలిపిన వివరాలప్రకారం.. నందికొట్కూరు పట్టణం వాల్మీకి కాలానికి చెందిన బోయ వెంకటేశ్వర్లు34 వెంకటేశ్వర్లు నందికొట్కూరు నుండి నంద్యాలకు వెళ్తూ తలముడివి గ్రామ సమీపమున మోటార్ సైకిల్ పై వెళ్తూ గుర్తుతెలియని వాహనం ఢీకొని బోయవెంకటేశ్వర్లు అక్కడికక్కడే చనిపోయాడు.నంద్యాలవైపునకు వెళుతూ గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బోయ వెంకటేశ్వర్లుమృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టమ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడి అన్న శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కుష్టువ్యాధి సర్వే, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ

**మేజర్ న్యూస్- చాగలమర్రి :** మండలంలోని పెద్దవంగలి గ్రామంలో శుక్రవారం కుష్టువ్యాధి సర్వే, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని వైద్యాధికారిణి తస్లీమా సుల్తానా ఆకస్మికంగా చేసారు. ఈ సందర్భంగా అనుమానిత కుష్ఠు రోగులను పరీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల్లో మన ఇంటి చుట్టూ పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రజలు ఇంటి పరిసరాల్లో గచ్చులు, తొట్లు, ఇతర టైర్లు తదితర వాటిల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే కాచి వడబోసిన నీటిని మాత్రమే తాగాలన్నారు. కార్యక్రమంలో మలేరియా ఆళ్లగడ్డ సబ్‌యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారులు వెంకటేశ్వరు, సుబ్బరాయుయుడు, ఏఎన్ఎం నూర్జహాన్,ఆశా కార్యకర్తలు రజని, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.


సర్వేను పరిశీలిస్తున్న వైద్యబృందం

## భూముల సర్వేలు పకడ్బందీగా నిర్వహించాలి


సర్వే అకాడమి డిప్యూటీ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

**మంత్రాలయం, మేజర్ న్యూస్ :** గ్రామాల్లో నిర్వహిస్తున్న భూముల సర్వేలు పకడ్బందీగా నిర్వహించాలని సర్వే అకాడమి డిప్యూటీ డైరెక్టర్ జిపి రామకృష్ణ పేర్కొన్నారు. మంత్రాలయం మండల పరిధిలోని బూదూరు దిబ్బనదొడ్డి గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే అకాడమి డిప్యూటీ డైరెక్టర్‌ను మంత్రాలయం మండలం నందు డివిజన్ సర్వే ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఉరుకుంద చారి, విలేజ్ సర్వేర్ తిమ్మేష్‌లు శాలువ కప్పి మెమోంటోతో సత్కరించారు. డివిజనల్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాస్‌రాజు, కర్నూలు టాస్క్ ఫోర్స్ డివిజనల్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వేయర్ విజయ కుమారి, మండల సర్వేయర్‌ఆశోక్‌కుమార్, పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ ః** నగరంలోని పురావస్తు శాఖ కార్యాలయం పక్కనున్న కిసాన్‌ఘాట్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. కిసాన్ ఘాట్ ఆర్చి దగ్గర అటుగా వెళుతున్న పాదాచారులు గుర్తించి సమాచారం ఇచ్చారన్నారు. వెళ్లి పరిశీలించగా మృతుడి వయసు సుమారు 40సం॥లు ఉంటుందని, మృతుడు చామనచాయ వర్ణంలో ఉండి, ఎత్తు సుమారు 5.5, నీలంరంగు ఫుల్ షర్ట్, బ్లూకలర్ ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. ఇతని ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 9121101061, 08518-277187కు సమాచారమివ్వాలన్నారు.


మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

## ఉచిత సహాయ ఉపకరణాల కొరకు నిర్ధారణ శిబిరాలు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ః** ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత సహాయ ఉపకరణాల కొరకు నిర్ధారణ శిబిరాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, అందులో భాగంగా శుక్రవారం మండల పరిధిలో నంద్యాల జిల్లా సమగ్ర శిక్ష వారు సంయుక్తంగా నంద్యాల జిల్లా డోన్ శాసనసభ నియోజకవర్గంలో ప్రత్యేక అవసరాలు గత పిల్లలకు ఉచిత సహాయ ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని ఈనెల 26వ తేది డోన్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 0 నుండి 18 సంవత్సరాల వయస్సు గల మానసిక వైకల్యం, శారీరక వైకల్యం, సెరిబ్రల్ పాలసీ, బహుళ వైకల్యం, వినికిడి లోపం గల పిల్లలకు మాత్రమే అలింకో వారి నిర్ధారణ పరీక్షలు డోన్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహిస్తారని ప్యాపిలి జడ్‌పిహెచ్‌ఎస్ బాలుర పాఠశాల హెచ్‌ఎం పద్మబాయి, రమేష్‌నాయుడు, ఎల్‌ఈఆర్‌పి వెంకట్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున ఈ శిభిరానికి దివ్యాంగ విద్యార్థితో పాటు తల్లిగాని, తండ్రి గాని ఒకరు హజరై నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాల్సిందిగా వారు కోరారు. పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న హెచ్‌ఎంలు, సంబంధిత అధికారులు

## కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు పనిభారం తగ్గించాలి

**– జిల్లా అధ్యక్షులు శివకృష్ణ , కార్యదర్శి సౌందర్య**

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో పని చేస్తున్న కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్లకు పని భారం తగ్గించాలని వర్కింగ్ ప్రసిడెంట్ సౌందర్య, అధ్యక్షుడు శివకృష్ణలు కోరారు. 8 పిఎం ఎఫ్ఆర్ఎస్ హాజరు సర్క్యూలర్ రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా వైద్యాధికారి డా. వెంకట రమణకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ ఆయుష్ మాను ఆరోగ్య మందిరంలో పని చేస్తున్న కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్లు రాత్రి పూట ఎఫ్ఆర్ఎస్ హాజరు వేస్తే రూ.5000లుఇన్సెటివ్ ఇస్తామా లేదా ఇవ్వము అన్న సర్క్యూలర్ వల్ల 10,032 మంది కమ్యూటిని హెల్త్ ఆఫీసర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్రంలోని హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఏ క్యాడర్‌కు లేని విధంగా ఇలా రాత్రి పూట ఎఫ్ఆర్ఎస్ నిబంధనలను తేవడం తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నారన్నారు. రాత్రి పూట మినహాయించాలని కోరారు. కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్లు 40 రోజుల పాటు సమ్మె చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం ఆరోగ్యశాఖ మంత్రి ద్వారా 8పిఎం తీసి వేస్తామని జీతం ఫిక్స్ చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. దీంతో సమ్మె విరమించామని, ఇంత వరకు సర్క్యూలర్ రద్దు చే యలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విలెజ్ క్లినిక్స్, గ్రామాల్లో ఊరికి చివర కొండ ప్రాంతాల్లో ఉండటం వల్ల ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎన్నో అవాంఛనీయ సంఘటనలు జరిగాయని, ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్ళామన్నారు. ఎన్నికల సమయంలో ఇప్పటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకొని వెళ్ళగా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని రాష్ట్ర నాయకులకు మాట ఇచ్చారన్నారు. 8 నెలల ఇన్సెటివ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆర్థికంగా నలిగిపోతున్న కుటుంబాలను ఆదుకోవాలన్నారు. అలాగే సిహెచ్‌ఓలకు ప్రాథమిక వైద్య కేంద్రాలకు విధులు వేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. రూమ్ రెంట్లు, విద్యుత్ బిల్లుల తోపాటు పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందించామన్నారు. గ్రామాలలో మారుమూల ప్రాంతాల్లో ఎలాంటి సౌకర్యం లేని చోట ప్రజలకు ఎన్నో వ్యయ ప్రయాసలు ఓర్చుకొని ప్రజలకు నిత్యం మెరుగైన వైద్య సేవలను అందిస్తున్న తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. స్పందించిన డిఎం అండ్ హెచ్‌ఓ వెంకట రమణ మాట్లాడుతూ సమస్యలను సిఎఫ్‌డబ్ల్యూకు పంపడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల, హారిక, రాజేష్, శ్రీనివాసులు, శ్రీకాంత్, రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.


వర్కింగ్‌ప్రెసిడెంట్ సౌందర్య


అధ్యక్షుడు శివకృష్ణ

## జాతీయ స్థాయి జంబోరి డైమండ్ జూబ్లీ ఫైనల్ సెలబ్రేషన్స్‌కు జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ ః** భారత ప్రభుత్వం భారత స్కౌట్స్, గైడ్స్ ద్వారా లక్నో నగరంలోని డిఫెన్స్ ఎక్స్పో గ్రౌండ్ వారిందవన్ యోజన ఉత్తరప్రదేశ్‌లో ప్రతిష్టాత్మకంగా వారం రోజుల పాటు నిర్వహించబోతున్న జాతీయ జంబోరి మరియు డైమండ్ జూబ్లీ ఫైనల్ సెలబ్రేషన్స్‌లో మండల పరిధిలోని నన్నూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ అడ్వాన్సుడ్ మాస్టర్‌గా చెక్కల మద్దిలేటి ఏడుగురు విద్యార్థులు జిల్లా విద్యా శాఖ అధికారి ఆదేశాల పాల్గొంటున్నారని పాఠశాల హెచ్‌ఎం నిర్మల వసంతకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కౌట్స్ మరియు గైడ్స్ యువతను సామాజిక సేవా క్రీడలు సాహస కార్యకలాపాల ద్వారా వ్యక్తిత్వ వికారం చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. వివిధ రాష్ట్రాల నుండి విచేస్తున్న స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులతో కలిసి కార్యక్రమాల్లో పాల్గొంటారని, కార్యక్రమానికి రాష్ట్రపతి, ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి పాల్గొంటున్నారని తెలిపారు. అనంతరం వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో గైడ్ కెప్టెంబర్ రాజీవ్ కుమారి, కళావతి వెంకటేశ్వర్లు, పెద్ద స్వామి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


వీడ్కోలు పలుకుతున్న దృశ్యం

## ఐచర్ వాహనం బోల్తా.. వ్యక్తి మృతి

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** జూపాడుబంగ్లా మండల పరిధిలోని తంగడంచె గ్రామ సమీపంలో మొక్కజొన్న లోడుతో వెళ్తున్న ఐచర్ వాహనం బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని తూడిచెర్ల గ్రామంలో మొక్కజొన్న లోడ్ వేసుకొని నందికోట్కూరు సమీపంలో గల రబ్బాని గోడౌన్‌లో నిల్వ చేయడానికి మొక్కజొన్నలు కొనుగోలు చేసిన వ్యాపారి దొంతుల నరసింహుడు, హమాలీలు వెళ్తుండగా సాయంకాలం సమయంలో తంగడంచె గ్రామ సమీపంలో ఎన్‌హెచ్ 340సీ రోడ్డుపై ఐచర్ వాహనం బోల్తా పడి అక్కడికక్కడే శ్రీనివాసులు కుమారుడు హమాలీ బోయ భరత్(27) మృతి చెందాడు. దీనికి కారణం వాహనం నడుపుతున్న డ్రైవర్ పింజరి షేక్‌బాష వాహనాన్ని అతి వేగంగా, అజాగ్రత్తగా నడువుతూ వాహనం అదుపు తప్పి కింద పందని, లారీపై కూర్చున్న హమాలీ ఒకరు బోయ భరత్ మృతికి కారణమని తెలిపారు. మిగిలిన హమాలీలు యుగంధర్, రహిమాన్‌బాష, వెంకటరమణ, శంకర్‌లకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నందికోట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మృతి చెందిన హమాలీ బోయ భరత్, బోల్తాపడిన ఐచర్ వాహనం

## క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** మండలంలోని ఆర్ కృష్ణాపురం గ్రామంలో శుక్రవారం డివిజినల్ డెవలప్మెంట్ అధికారి శివారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీవో నూర్జహాన్, డిప్యూటీ ఎంపీడీవో అశ్విన్ కుమార్ లు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మొత్తాన్ని శుభ్రం చేశారు. ప్రజలకు తరి చెత్త పొడి చెత్త పై అవగాహన కల్పించారు. అనంతరం సచివాలయంలో గ్రామాన్ని ఎలా పచ్చదనంగా ఉంచాలి, పరిశుభ్రంగా ఉంచాలి అని అంశాలపై శిక్షణ ఇచ్చారు. 19 మంది గ్రీన్ అంబాసిడర్లు 15 మంది గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.



## ఎస్ డి ఆర్ వరల్డ్ స్కూల్లో అట్టహాసంగా 11వ వార్షిక క్రీడా సంబరాలు

-విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు పై ఆసక్తి పెంచుకోవాలి
-నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్
-క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి.. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ
-క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి..
-ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ శనివారపు వెంకట్రామిరెడ్డి
-ఎస్డిఆర్ వరల్డ్ స్కూల్లో చదువుతోపాటు క్రీడలు కూడా ప్రాధాన్యత ఇస్తాం
-ఎస్డిఆర్ వరల్డ్ స్కూల్ చైర్మెన్ శనివారపు కొండారెడ్డి






**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** ఎస్ డి ఆర్ వరల్డ్ స్కూల్లో ఘనంగా 11వ వార్షిక క్రీడా సంబరాలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థుల ఆటపాటలతో పాఠశాలలో పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ, ఎస్ వి ఆర్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ శనివారపు వెంకటరామిరెడ్డి ముఖ్య అతిధులుగా హాజరయ్యి క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలుఎంతో అవసరమని, క్రీడల ద్వారా రోగనిరోధక శక్తి మరియు మానసికంగానూ,శారీరికంగానూ దృఢంగా తయారవుతారని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి తాము చదువుకున్న పాఠశాలకు తల్లిదండ్రులకు దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు ఎడ్యుకేషన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రెండు కళ్ళలాంటివని, వాటిని రెండింటిని సామానంగా పాటిస్తూ రెండిట్లో రాణించాలని కోరారు. ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ శనివారపు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు ముఖ్యం కాదని గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, గెలిచిన వెంటనే పొంగిపోకుండా కృతజ్ఞతా భావంతో ఉండాలని, ఓడిన వారిని ప్రోత్సహించాలని సూచించారు. స్కూల్ చైర్మన్ శనివారపు కొండారెడ్డి మాట్లాడుతూ , ఎస్ డి ఆర్ వరల్డ్ స్కూల్లో చదువు తో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇస్తామని, విద్యార్థి సర్వతోముఖాభివృద్ధి కి కృషి చేస్తామని తెలిపారు. పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మద్దతుతో ఈ క్రీడోత్సవాలువిజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పాఠశాల యాజమాన్యం, సిబ్బంది, తల్లిదండ్రులను అతిథులు ప్రత్యేకంగా అభినందించారు.ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంధి, విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా

**– టీడీపీ ఇంఛార్జీ రాఘవేంద్రరెడ్డి**


టీడీపీ ఇంచార్జీ సమస్యలను వివరిస్తున్న గ్రామస్థులు

**మంత్రాలయం, మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రాలయం టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్రరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మాధవరం గ్రామంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలను ఇంచార్జీకి విన్నవించారు. తమ సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్ళి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధికారులు కూడ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

## విద్యార్థులకు విద్యా ప్రమాణాలు, మౌళిక వసతులు కల్పించాలి

**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే కోట్ల**


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

**డోన్, మేజర్న్యూస్ః** ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు విద్యా ప్రమాణాలు, వారికి అవసరమైన మౌళిక వసతులు క్రమం తప్పకుండా కల్పించాలని డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్ఎన్ కాలనీలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే కోట్ల ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాత తరగతి గదులు, హజరు రిజిస్టర్లు, మరుగుదొడ్లు, త్రాగునీటి సదుపాయాలను ఎమ్మెల్యే కోట్ల పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉచిత మద్యాహ్న భోజన పథకం అమలుపై విద్యార్థులను సంప్రదించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. స్వంగా రుచి చూసి భోజనం యొక్క నాణ్యత, రుచి, పరిశుభ్రత వంటి అంశాలను సమగ్రంగా తనిఖీ చేశారు. ఆయన వెంట సంబందిత అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వెంటనే ఆపాలి

**– ప్రజల నుంచి కోటి సంతకాల సేకరణ**
**– మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి**


సంతకాలను సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

**నంద్యాల కల్చరల్, మేజర్న్యూస్ :** కూటమి ప్రభుత్వం కళ్లు తెరవాలని మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడవద్దని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు నంద్యాల పట్టణంలోని 17,18,19,20వార్డులలో ఉన్న విశ్వనగర్, ఎన్‌జిఓ కాలనీ, పొన్నాపురం, ఏకలవ్యనగర్ ప్రాంతంలో శిల్పా రవి కలియతిరుగుతూ ప్రజల నుంచి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా శిల్పా రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద, మధ్య తరగతి విద్యార్థుల బంగారు భవిష్యత్తును నాశనం చేసేందుకు చేస్తున్న కుట్రలో భాగంగా రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం మాజీ మంత్రి వైయస్ జగన్ 17 మెడికల్ కళాశాలలను ప్రారంభించేందుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. తొలి దశలో 5 మెడికల్ కళాశాలలను ప్రారంభించారని తెలిపారు. నంద్యాల మెడికల్ కళాశాల ప్రథమ సంవత్సరం చదివిన విద్యార్థికి స్టేట్ ఫస్ట్‌ర్యాంక్ రావడం జరిగిందన్నారు. ఇటీవల నంద్యాల మెడికల్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలకు టీడీపీ నేతుల రావడం జరిగిందని అయితే ఆ పార్టీ హోంశాఖ మంత్రి వంగల పూడి అనిత మెడికల్ కళాశాలలే లేవని అసత్యపు అబద్ధపు మాటలు మాట్లాడడం ప్రజలు గ్రహించాలన్నారు. ప్రజలు తాము చేస్తున్న ప్రజా ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు.

## నిర్మాణ వ్యర్థాలను నగరపాలకకే అప్పగించండి

**:– నగరపాలక సంస్థ కమీషనర్ పి. విశ్వనాథ్**



**కర్నూలు (కెఎంసి), మేజర్న్యూస్ :** నగరంలో నిర్మాణ రంగంలో ఉత్పత్తి అయ్యే గృహ, భవన, మరమత్తు వ్యర్థాలను తప్పనిసరిగా నగరపాలక సంస్థ వాహనాలకే అప్పగించాలని కమీషనర్ పి విశ్వనాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. ఎక్కడబడితే అక్కడ వ్యర్థాలను పారబోసి నగరాన్ని అపరిశుభ్రంగా మార్చే చర్యలను ఎవ్వరు చేయొద్దన్నారు. నగరంలో కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఆగస్టు 1 నుండి నిర్మాణ వ్యర్థాల నిర్వహణకు కొత్త విధానాన్ని అమలు చేస్తున్నామని, ఈ విధానానికి ప్రజల్లో విశేష స్పందన లభిస్తుందన్నారు. ఇప్పటి వరకు 250కిపైగా ట్రాక్టర్ల ద్వారా నిర్మాణ వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్ ప్రక్రియను పంపించినట్లు పేర్కొన్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు కేవలం రూ.500రవాణా చార్జీ మాత్రమే యజమానులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రజలు 7422992299కు ఫోన్ చేసి వ్యర్థాలను తప్పక నగరపాలక సంస్థకు అప్పగించాలని కోరారు.

## డా. భాస్కర్ రెడ్డి హెూమియో వైద్యంతో మోకాలి నొప్పి నుంచి విముక్తి


ఉచిత హెూమియో వైద్య శిబిరంలో పేషెంట్ పుష్పమ్మతో డాక్టర్ భాస్కర్ రెడ్డి

**ఎమ్మిగనూరు అర్బన్, మేజర్ న్యూస్:** 'చాలా రోజుల నుంచి ఎక్కడెక్కడో ఎన్ని ప్రైవేట్ ఆసుపత్రులు తిరిగినా తనకు ఎలాంటి పరిష్కారం లభించలేదు. దయాల్బాగు రాధాస్వామి చారిటబుల్ హెూమియో డిస్పెన్సరి కర్నూలు హెూమియో వైద్యుడు భాస్కర్ రెడ్డి చేసిన వైద్యం వల్లనే భరించలేని మోకాలి నొప్పి నుంచి తనకు విముక్తి లభించింది' అంటూ గోనెగండ్ల మండలం అల్వాల గ్రామానికి చెందిన పుష్పమ్మ అనే 55 ఏళ్ళ మహిళ ఆనందం వ్యక్తం చేసింది. కొన్ని రోజులుగా తీవ్రమైన మోకాలి నొప్పితో నడవలేని స్థితిలో ఉన్న తాను ఎన్నో ప్రైవేట్ ఆసుపత్రులు తిరిగానంటూ తన అభిప్రాయాలను మీడియాతో పంచుకున్నారు. అయితే వెళ్లిన ప్రతి చోటా అక్కడి వైద్యులు మోకాలు అరిగింది సర్జరీ చేసుకోవాలని తనకు సూచించినట్లు తెలిపారు. కర్నూలుకు చెందిన ప్రముఖ హెూమియో వైద్యుడు భాస్కర్ రెడ్డి ప్రతి నెల రెండవ శనివారం కోటెకల్లు గ్రామంలో ఉచిత హెూమియో వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని తెలిసి అక్కడికి వెళ్లినట్లు వివరించారు. నాలుగు నెలల పాటు హెూమియో మందులు వాడటంతో తనకున్న మోకాలి నొప్పి, వాపు పూర్తిగా నయం అయ్యిందన్నారు. ఇప్పుడు ఎలాంటి నొప్పి లేకుండా చక్కగా నడవగలుగుతున్నానని ఆమె సంతోషం వ్యక్తం చేసింది. తనతో పాటు ఎంతోమంది రోగులకు ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ఉచితంగా వైద్యం అందిస్తున్న హెూమియో డాక్టర్ భాస్కర్ రెడ్డికి ఈ సందర్భంగా పుష్పమ్మ కృతజ్ఞతలు తెలియజేశారు.

## మంత్రి లోకేష్ ను కలిసిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ


మంత్రి నారా లోకేష్ కలిసిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, ఆమె సోదరుడు

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** విజయవాడ క్యాంప్ ఆఫీస్ లో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ, యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డలోని శిల్పాలను ప్రమోట్ చేసేందుకు ప్లానింగ్ చేయడం గురించి వివరించడం జరిగింది. అలాగే ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన కాంపౌండ్ వాల్స్ మరియు విద్యార్థులు పడుతున్న ఇబ్బందుల గురించి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వినతిపత్రం సమర్పించారు.

## విజయ డైరీ అక్రమాలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లిన భూమా జగద్విఖ్యాత్ రెడ్డి

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :**

విజయ డైరీ అక్రమాలను ఆళ్లగడ్డ తాలూకా టిడిపి యువ నాయకులు భూమా జగద్విఖ్యాత్ రెడ్డి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. విజయవాడ క్యాంప్ ఆఫీసులో శుక్రవారం మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నంద్యాల విజయ డైరీ లో చైర్మన్ మరియు డైరెక్టర్లు చేస్తున్న అవినీతి అక్రమాలను తెలియజేశారు. పాల ప్యాకెట్ పై ప్రజలపై భారం మోపి సంవత్సరానికి 7 కోట్లు పాల ప్యాకెట్లపై సంపాదిస్తున్నారని, గత కొద్దిరోజుల కిందట విజయ డైరీ ని స్థాపించిన ఎన్టీ రామారావు శిలాఫలకాన్ని కాల్వలో పడేయడంతో మేము అక్కడికి వెళ్లి అధికారులతో కొట్లాడి మళ్లీ శిలాఫలకాన్ని అక్కడ పెట్టించడం జరిగిందని తెలియజేసారు.విజయ డైరీ కి సంబంధించి 35 ఎకరాల భూమి ఉందని ఆ భూమిని వైసిపి చైర్మన్ గత వైసిపి హయాంలో వారిపై ఆన్లైన్ చేపించుకోవడం జరిగిందని దాదాపు 350 కోట్ల రూపాయలు విలువచేసే భూమి ఇప్పుడు ఈ భూమిని ప్రభుత్వానికి చేరేలాగా చర్యలు తీసుకోవాలని, గతంలో ఈ విషయంపై సీఎం దృష్టికి కూడా తీసుకొని వెళ్లడం జరిగిందన్నారు. ఇందుకు స్పందించిన మంత్రి నారా లోకేష్ విజయ డైరీ లో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకుంటామన్నారు.

## విద్యార్థులకు బహుమతుల పంపిణీ


బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయ అధికారి తిమ్మారెడ్డి

**కోవెలకుంట్ల, మేజర్న్యూస్ :** కోవెలకుంట్లలోని గ్రంథాలయంలో 58వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. ఈనెల 14వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జరిగిన ఈ కాంపిటీషన్ పోటీలలో గ్రంథాలయ అధికారి బాల తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బాల తిమ్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొని తమ నైపుణ్యాలను మరింత పెంచుకోవాలని అన్నారు. భవిష్యత్తులో ఈ కాంపిటీషన్‌లో పాల్గొన్న విద్యార్థులకు ఎంతో మంచి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధీర్‌కుమార్, తిరుపతిరెడ్డి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### అనుమతులు లేని భవనాల క్రమబద్ధీకరణ కొరకు
# బిపిఎస్‌ను వినియోగించుకోవాలి

**మున్సిపల్ ఛైర్మెన్ సప్తశైల రాజేష్**


డోన్ మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్

**డోన్, మేజర్‌న్యూస్‌ః** అనుమతులు లేని భవనాల క్రమబద్ధీకరణ కొరకు రాష్ట్ర ప్రభుత్వం బిపిఎస్ పథకాన్ని ప్రవేశపెట్టిందని డోన్ మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులులేని భవనాల క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జిఓఎంఎస్ నెంబర్.225ను ఈనెల 12వ తేది జారీ చేసిందని, ఈ పథకం ప్రకారం మున్సిపల్ అనుమతులు లేకుండా లేదా ఆమోదిత ప్రణాళికలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను బిపిఎస్-2025 కింద చట్టబద్ధం చేసుకునే అవకాశం కల్పించబడింది. 1-1-1985 నుండి 31-8-2025 మధ్య కాలంలో నిర్మాణ అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలు ఈ పథకానికి అర్హులని, కావున పట్టణ ప్రజలు తమ నిర్మాణాలను బిపిఎస్ ద్వారా క్రమబద్ధీకరించుకోవచ్చున్నారు. ఈ అవకాశం 12-03-2026వ తేది వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని, పట్టణ ప్రజలు ఈ బిపిఎస్ అవకాశాన్ని వినియోగించుకొని తమ భవనాలను నిబంధనల ప్రకారం రెగ్యులరైజ్ చేసుకోవాలని కోరారు.

## నంద్యాల సీఐపై చర్యలకు జిల్లా పోలీస్ కంప్లైంట్ ఆథారిటీ ఆదేశాలు



అప్పటి సీఐ ఇస్మాయిల్



గన్నీ కరీం

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్** : నంద్యాలలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసిన నంద్యాల రెండవ పట్టణ ఒక్కప్పటి సీఐ ఇస్మాయిల్‌పై జిల్లా పోలీస్ కంప్లైంట్ ఆథారిటీ చర్యలకు ఆదేశించిందని వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గన్నీ కరీం అన్నారు. ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ గత సంవత్సరం తనపై అక్రమంగా తప్పుడు కేసులు నమోదు చేసి రౌడీషీట్ తెరిచి ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. ఇందుకు కారణమైన సీఐ ఇస్మాయిల్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీస్ కంప్లైంట్ అథారిటీని ఆశ్రయించినట్లు తెలిపారు. నలుగురు రిటైర్డ్ జడ్జిలతో కూడిన అథారిటీ ధర్మాసనం ఏడాది పాటు సుదీర్ఘ విచారణ జరిపిందని అన్నారు. సీఐ ఇస్మాయిల్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఛైర్మన్ వెంకట రమణా రెడ్డి తీర్పు ప్రకటించినట్లు గన్నీ కరీం తెలిపారు. సీఐపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర చీఫ్ సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీతో పాటు రాష్ట్ర హోం శాఖ, జిల్లా ఎస్పీకి ఆదేశాలు జారీ చేశారని ఆయన తెలిపారు. తనకు జరిగిన అన్యాయంపై పోరాడిన తనకు అథారిటీ న్యాయం జరిగేలా తీర్పు ఇచ్చినట్లుగా భావిస్తున్నానని తెలిపారు.

## మండలంలో ట్రాఫిక్ నియంత్రణ అవగాహన ర్యాలీ




**సి.బెలగల్ మేజర్ న్యూస్ :** సి.బెలగల్ మండలంలో శుక్రవారం మండల ఎస్సై వేణుగోపాలరాజు జీనియస్ గ్లోబల్ స్కూల్ సహకారంతో ట్రాఫిక్ నియంత్రణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా మండలంలో నిర్మిస్తున్న రోడ్డు పనుల వల్ల ఒకే దారిలో ఎదురెదురు వాహనాలు ప్రయాణించాల్సిన అవసరం ఉందనీ,వాహనదారులు సమన్వయంతో ఇతర వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ అంతరాయం లేకుండా క్రమంగా వాహనాలను నడపాలని,అదేవిధంగా రోడ్డు విస్తరణలో భాగంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులు రోడ్డు దాటేటప్పుడు వాహనదారులు సమన్వయం పాటించి దారి వదలాలని, అదేవిదంగా ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలని తలకు రక్షణగా ఎలిమెంట్ తప్పక ధరించాలని సూచించారు.ఈ కార్యక్రమం లో ఎస్సై వేణుగోపాలరాజు,పోలీసు సిబ్బంది,జీనియస్ గ్లోబల్ పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆధునిక పరిజ్ఞానంతో 48 గంటల్లో కేసును చేధించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దొంగతనం కేసును పోలీసులు 48 గంటల్లో చేధించారు. వివరాల్లోకి వెళ్లితే వెలుగోడు గ్రామంలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న కుప్పల రమణయ్య ఇంట్లో దొంగతనం జరిగింది. ఈ నెల 19వ తేదీన సాయంత్రం 6 నుంచి 8 గంటల సమయంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంటి తాలాలు పగలగొట్టి రూ.3 వేలు విలువ గల సెల్‌ఫోన్ అలాగే బీరువా తాలాలు పగలగొట్టి రూ.60 వేలు నగదు, రూ.1.35 లక్షల విలువ గల 24 గ్రా. బంగారు నెక్లెస్ దొంగలించారు. బాధితుడు పోలీసులను ఆశ్రయించి కేసు నమోదు చేయగా నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాల మేరకు ఆత్మకూరు డిఎస్పీ రామాంజి నాయక్ సూచనలతో వెలుగోడు ఎస్సై సురేష్ కేసు దర్యాప్తు చేపట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దొంగతనం చేసింది కుప్పాల రెడ్డయ్యగా గుర్తించి వెలుగోడు గ్రామం బయట ఉన్న ఎస్ఎన్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల సమీ పంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. దొంగతనం చేసిన సొత్తును స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించినట్లు తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించిన వెలుగోడు పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

# పట్టు వదలని విక్రమార్కుడు మాండ్ర లింగారెడ్డి..!

- ప్రజా సేవకు నిలువెత్తు సాక్ష్యం.. సురేంద్ర నాథ్ రెడ్డి
- ఘనంగా అల్లూరులో మాండ్ర జన్మదిన వేడుకలు
- మాండ్ర లింగారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నాయకులు



**నందికొట్కూరు రూరల్ మేజర్ న్యూస్ :** ప్రజా సేవకు నిలువెత్తు సాక్ష్యం ..పట్టువదలని విక్రమార్కుడు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాండ్ర లింగారెడ్డి అంటూ నందికొట్కూరు టిడిపి మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి కొనియాడారు. శుక్రవారం మండల పరిధిలోని అల్లూరు గ్రామం నందు మాండ్ర స్వగృహంలో మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మాండ్ర లింగారెడ్డి జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు.ఆత్మీయ నేత మాండ్ర లింగారెడ్డికి టిడిపి నాయకులు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులుహృదయపూర్వకజన్మదినశుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సురేంద్ర నాథ్ రెడ్డి మాట్లాడుతూ ?నందికొట్కూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి మూల స్తంభం అంతేకాక 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి గెలుపునకు వివిధ గ్రామాల్లో పురవీధుల గుండా ఇంటింటి ప్రచారం చేస్తూ ఎమ్మెల్యే గిత్త జయసూర్య గెలుపులో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ప్రజలకు చేస్తున్న సేవలు ఎనలేనివి అన్నారు. ఆయన నిస్వార్థ సేవ, నాయకత్వ లక్షణాలు ఎందరికో ఆదర్శప్రాయం అన్నారు. తెలుగుదేశంపార్టీని బలోపేతం చేయడంలో, కార్యకర్తలకు అండగా నిలబడడంలోఆయన పాత్రవెలకట్ట లేనిదన్నారు. నియోజకవర్గంలో పార్టీఅభివృద్ధికి, ప్రజలసమస్యల పరిష్కారానికి ఆయన అహర్నిశలు కృషి చేస్తున్నారని,సుదీర్ఘ రాజకీయ అనుభవం, ప్రజలతో మమేకమయ్యే తత్వం ఆయనను నియోజకవర్గ ప్రజలకు మరింత చేశానని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ, టిడిపి సీనియర్ నాయకులు సున్నంపల్లి శ్రీనివాసులు, తిమ్మారెడ్డి,రహీం, ఎమ్మెల్యే పిఏ రవీంద్రబాబు , పంచాయతీ సెక్రెటరీ చంద్రశేఖర్ , రాజశేఖర్ ఫారుక్, హుసైన్, పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పరిశుభ్రతను పెంపొందించండి - ఎంపిడిఒ సావిత్రి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

**దొర్నిపాడుమేజర్,న్యూస్ః** గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రతను పెంపొందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిడిఒ పావిత్రి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని డబ్ల్యు గోవిందిన్నె గ్రామంలో పచ్చదనం పరిశుభ్రతపై సర్పంచ్‌లకు, ఉప సర్పంచ్‌లకు పంచాయితీ కార్యదర్శిలకు ఎల్.ఎస్.డి.జి టీం 5పై ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ సుస్థిరత పరిశుభ్రత వ్యర్థాల నిర్వహణ చెట్ల పెంపకం మరియు జీవ వైవిధ్యాన్ని ప్రోత్సహించడమే సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీరణ టీం5 లక్ష్యమని ఆమె అన్నారు. అనంతరం పంచాయితీ కార్యదర్శి మధు ఆధ్వర్యంలో పచ్చదనం పరిశుభ్రత పెంపొందించేందుకు చేపట్టాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. అలాగే గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా రోడ్లు, డ్రైనేజిలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అందుకు పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు నిర్వహించాలని అదే విధంగా ఆరోగ్యవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు మొక్కలు నాటిన ప్రతి మొక్కను పరిరక్షించి ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సావిత్రి, పంచాయితీ కార్యదర్శి మధు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, గ్రీన్ అంబాసిడర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

**ఏపి బెస్త సంక్షేమ, అభివృద్ధి కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ప్రజావైద్యశాల బెస్త మల్లికార్జున**



మాట్లాడుతున్న ప్రజావైద్యశాల బెస్త మల్లికార్జున

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్ః** మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం ఒక కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, మత్స్యకారుల నడ్డి విరిచే 217 జీవోను రద్దుతో రాష్ట్రంలోని సాంప్రదాయం మత్స్యకారులకు అండగా మేమున్నామనే భరోసా కూటమి ప్రభుత్వం కల్పించిందని ఏపి బెస్త సంక్షేమ, అభివృద్ధి కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ప్రజావైద్యశాల బెస్త మల్లికార్జున అన్నారు. శుక్రవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉదయం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేడి హీరానాయక్, తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్, బెస్త సంఘం రాష్ట్ర నాయకులు గగ్గెర రమణయ్య, మార్కెట్ ప్రసాద్, పాణ్యం సుబ్బయ్య, గొడుగు హరీష్, బాలచంద్రుడు, గొడుగు మల్లికార్జున, పత్తికొండ బాలాజీ, జనసేన పార్టీ నాయకులు బొల్లవరం ప్రసాద్, శ్రీనివాసులు, మత్స్యశాఖ జిల్లా అధికారులు, మత్స్య సహకార సంఘ సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల అధ్యాపక బృందం

**బనగానపల్లె మేజర్‌న్యూస్ :** బనగానపల్లె పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. భాస్కర్ తెలిపారు. 9వ తరగతి విద్యార్థి అభిషేక్ రాజు అండర్ - 17 సాఫ్ట్‌బాల్ నందిని అండర్ -17 బేస్‌బాల్ , అర్చన అండర్ - 14 బేస్‌బాల్ క్రీడలలో జిల్లాస్థాయిలో తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వీరు అహోబిలం, కాకినాడ, చిత్తూరులలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఫిజికల్ డైరెక్టర్ సుధాకర్‌ను పాఠశాల బృందం విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

## అనుమతులు లేకుండా వసతి గృహాలు నిర్మిస్తే చర్యలు తప్పవు

**మంత్రాలయం, మేజర్ న్యూస్ :**



మంత్రాలయం మండల కేంద్రంలో అనుమతులు లేకుండా వసతి గృహాలు నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కూడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆయన మంత్రాలయం మండల కేంద్రంలోని రామచంద్ర నగర్‌లోని నూతన భవనాలు, హోంస్టేలను పంచాయతీ అధికారులతో కలిసి పరిశీలించారు. అనుమతులు లేకపోతే కేసు నమోదు చేస్తామని యజమానులను హెచ్చరించారు.

APPSC,TGPSC, DSC, SSC, RRB, POLICE and Other Competitive Exams

# కరెంట్ అఫైర్స్

❍ అక్టోబరు 2025లో 10వ జాతీయ స్థాయి కాలుష్య ప్రతిస్పందన వ్యాయామం ఎక్కడ జరిగింది?
**– అక్టోబరు 05,06 తేదీలలో చెన్నైలో**

❍ సాక్షమ్ కౌంటర్ మానవ రహిత వైమానిక వ్యవస్థను ఏ సంస్థ అభివృద్ధి చేసింది?
**– భారత ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్**

❍ భారతదేశంలో ప్రతి సంవత్సరం ఏ రోజున జాతీయ తపాలా దినోత్సవాన్ని జరుపుకుంటారు?
**–అక్టోబరు 10న(1854లో లార్డ్ డల్హౌసి స్థాపించారు)**

❍ " I am Giorgia - MyRoots, MyPrinciples" ఏ దేశ ప్రధాని ఆత్మకథ? అలాగే దీనికి ముందు మాట ఏ దేశ ప్రధాని రాసారు?
**–ఇటలీ ప్రధాన మంత్రి జార్జియా మెలోనీ. దీనికి భారత ప్రధాని నరేంద్రమోడి ముందుమాట రాసారు.**

❍ ఏ అంతర్జాతీయ సంస్థ భారతదేశంలో తొలిసారిగా చైల్డ్ ప్రొటెక్షన్ ఇన్నోవేషన్ ఫండ్ అనే ప్రత్యేక నిధిని ప్రారంభించింది?
**– యునిసెఫ్**

❍ దక్షిణ భారతదేశంలోనూ మరియు తెలంగాణాలోను మొదటి పూర్తి స్థాయి సౌరశక్తి గ్రామంగా గుర్తింపు పొందినది ఏది?
**– కొండారెడ్డిపల్లి (నాగర్ కర్నూల్)**

❍ భారత ప్రధాని నరేంద్ర మోడి నిజ జీవితం పై మేరా దేష్ పెహెలే సంగీత ప్రదర్శన ఎక్కడ నిర్వహించబడినది?
**– హైదరాబాద్**

❍ హెచ్ 125 సౌర హెలికాప్టర్‌ల తయారీ కేంద్రాన్ని ఎక్కడ ఏర్పాటు చేయనున్నట్లు ఎయిర్ బస్ 2025 అక్టోబరు 01న ప్రకటించింది?
**– కర్ణాటకలోని కోలారు జిల్లా వెమగల్ లో**

❍ ప్రపంచ పారా అథ్లెటిక్స్‌లో భారత అథ్లెట్లు నిషాద్, సిమ్రన్ శర్మ పసిడి పతకాలు సొంతం చేసుకున్నారు. నిషార్ కుమార్ ఏ రాష్ట్రానికి చెందిన వాడు?
**– ఉత్తరప్రదేశ్ (2.14 మీ. జంప్‌తో అగ్రస్థానంలో) 2020, 2024 పారా ఒలంపిక్స్‌లో కాంస్యం గెలిచాడు.**

❍ దీపావళిని స్టేట్ హాలిడేగా ప్రకటించిన 3వ అమెరికా రాష్ట్రంగా కాలిఫోర్నియా నిలిచింది. అయితే మొదటి రెండు ఏవి?
**– పెన్సిల్వేనియా, కనెక్టివిటి**

❍ సముద్ర రక్షణ గురించి అవగాహన పెంచడానికి ప్రపంచంలో మొట్టమొదటి ప్రత్యక్ష నీటి అడుగున ఇంటర్వ్యూ ను ఏ ద్వీప దేశం నిర్వహించినది?
**– పలావ్**

❍ శత్రు దేశాల డ్రోన్‌ల ముప్పు నుండి దేశ సరిహద్దులను రక్షించుటకు ప్రవేశపెట్టిన స్వదేశీ యాంటి డ్రోన్ అడ్ సిస్టమ్ Saksham ను ఏ సంస్థ అభివృద్ధి చేసింది?
**– భారత ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్**

❍ నెసోలింక్స్ బనా బిటనె అనే కొత్త కందిరీగ జాతి ఏ రాష్ట్రాలలో కనుగొనబడింది?
**– పశ్చిమ బెంగాల్**

❍ స్థిరమైన పర్యాటక అభివృద్ధి మరియు వారసత్వ పరిరక్షణ చర్యలకు గాను ఏ రాష్ట్ర పర్యాటక శాఖ ప్రతిష్టాత్మక గ్లోబల్ టూరిజం అవార్డు 2025 ను గెల్చుకుంది?
**– ఆంధ్రప్రదేశ్**

❍ సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులను పరిరక్షించినందుకు మైసూర్‌కి చెందిన ఏ ప్రజా ఉద్యమానికి 31వ డాక్టర్ ఎమ్.ఎస్. స్వామినాథన్ అవార్డు లభించింది?
**– సహజ సమృధ**

❍ మహిళలకు, ఆడపిల్లలకు భద్రత కల్పించే లక్ష్యంతో 'మిషన్ శక్తి 5.0' ప్రోగ్రాంను ఏ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది?
**– ఉత్తరప్రదేశ్**

❍ ఇటీవల పదవీ విరమణ చేసిన ఆసియాలో మొదటి మహిళా లోకో పైలెట్ ఎవరు?
**– సురేఖ యాదవ్ (1989లో లోకో పైలెట్‌గా చేసారు. 2023లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ నడిపారు)**

❍ అంతర్జాతీయ సైబర్ ఆధారిత ఆర్థిక నేరాలను లక్ష్యంగా చేసుకొని ఇంటర్‌పోల్ నేతృత్వంలో నిర్వహించబడిన ఆపరేషన్ పేరేంటి?
**– ఆపరేషన్ హైచీ-6** (Operation HAECHI VI)

❍ భారతదేశంలో మొదటి మురికివాడ రహిత నగరంగా ఇటీవల ఏది నిలిచింది?
**– ఛండీగడ్**








❍ ఎబోవ్ & బియాండ్ - ఎక్స్‌ప్లోరింగ్ ద అమేజింగ్ వరల్డ్ ఆఫ్ ఏవియేషన్ పుస్తక రచయిత ఎవరు?
**–శివకుమార్ మోహంకా**

❍ ప్రతి ఏడాది అక్టోబరు 10న జాతీయ పోస్టల్ దినోత్సవంగా నిర్వహిస్తారు. అలాగే ఇదే రోజు ప్రపంచ మానసిక ఆరోగ్యపు రోజుగా కూడా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇతివృత్తం ఏమిటి?
**– యాక్సెస్ టు సర్వీసెస్ - మెంటల్ హెల్త్ ఇన్ క్యాటస్ట్రోఫిస్ & ఎమర్జెన్సీస్**

❍ ప్రపంచ జంతు సంక్షేమ రోజుగా అలాగే జంతు ప్రేమికుల దినోత్సవంగా కూడా నిర్వహిస్తారు. అది ఏ రోజు?
**– అక్టోబరు 04**

❍ ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో రహదారిని భారత్‌కు చెందిన బోర్డర్స్ రోడ్ ఆర్గనైజేషన్ నిర్మించింది. ఇది ఎక్కడ ఉంది? అలాగే ఇది ఎంత ఎత్తులో ఉంది?
**– హిమాంక్ ప్రాజెక్టులో భాగంగా లఢఖ్‌లో సముద్ర మట్టానికి 19,400 అడుగుల ఎత్తులో ఉంది.**

❍ హింస, దుర్వినియోగం మరియు దోపిడి నుండి పిల్లలను రక్షించడానికి ఏ దేశం మొట్టమొదటి జాతీయ బాలల భద్రతా విధానాన్ని ప్రారంభించింది?
**– ఫిజీ**

❍ ఇండియా మొబైల్ కాంగ్రెస్‌ను న్యూఢిల్లీలో ఎపుడు నిర్వహించారు? థీమ్ ఏమిటి?
**– అక్టోబర్ 8, ఇన్నోవేట్ టు ట్రాన్స్‌ఫామ్**

❍ పిఎమ్ ధన్ ధాన్య కృషి యోజన పథకానికి దేశవ్యాప్తంగా 100 జిల్లాలను ఎంపిక చేసారు. అయితే తెలంగాణ నుండి ఎన్ని జిల్లాలు ఎంపికయ్యాయి?
**4 (జనగామ, గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణ పేట)** (తక్కువ వ్యవసాయ ఉత్పాదకత కల్గిన జిల్లాలో ఎక్కువ ఉత్పాదకత సాధించడం. రానున్న 6 ఏళ్ళలో దీనికి 24 వేల కోట్లు వెచ్చిస్తారు).

❍ మానవ ముఖంతో చెక్కబడిన 12000 సంవత్సరాల నాటి పురాతన టి- ఆకారపు స్తంభాన్ని పురావస్తు శాస్త్రవేత్తలు ఏ దేశంలో కనుగొన్నారు?
**– తుర్కియే**

❍ టొబాకో ఫ్రీ యూత్ కాంపైన్ 3.0ను ఏ మంత్రిత్వశాఖలు సంయుక్తంగా ప్రారంభించాయి?
**– మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ & మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ & ఫ్యామిలీ వెల్ఫేర్**

❍ కోల్ ఇండియా లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన సౌత్ ఈస్టర్న్ కోల్ ఫీల్డ్ లిమిటెడ్ తన కొత్త కేంద్ర స్టోర్‌ను ఎక్కడ ప్రారంభించింది?
**– ఛత్తీస్‌ఘడ్‌లోని కోర్బాలో (మహిళలే నిర్వహిస్తారు)**

❍ భారతదేశపు మొట్టమొదటి మెంటల్ హెల్త్ అంబాసిడర్‌గా ఎవరు నియమితులయ్యారు?
**– దీపికా పదుకొనే**

❍ ఇటీవల ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ సోషల్ సెక్యూరిటీ అవార్డును ఏ దేశం గెల్చుకుంది?
**– భారత్**
భారత్‌లో 2015లో 19% మంది ప్రజలకు ఉన్న సామాజిక భద్రత 2025 నాటికి 64.3%కి చేరింది

❍ నాట్పోల్‌రెక్స్-ఎక్స్ పేరుతో భారత తీర రక్షక దళం విన్యాసాన్ని ఎక్కడ అక్టోబరు 05,06 తేదీలలో కొనసాగింది?
**– తమిళనాడులోని చెన్నైలో**

❍ రాజీవ్ గాంధీ సద్భావన అవార్డు 2025 ఇటీవల ఎవరికి వచ్చింది?
**– సల్మాన్ ఖుర్షీద్**

❍ అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఎఇఎ) 181వ సభ్య దేశంగా చేరిన దేశం ఏది?
**– మాల్దీవులు**

❍ అక్టోబరు 2025లో విశాఖ పట్నం ఓడరేవులో ప్రవేశపెట్టబడిన భారతదేశపు మొట్టమొదటి వెరీ లార్జ్ గ్యాస్ క్యారియర్ పేరేంటి?
**– శివాలిక్**

❍ జాతీయ వ్యవసాయ ఈ-మార్కెట్‌ను భారత ప్రభుత్వం విస్తరించింది. కొత్తగా 9 వస్తువులను ఈ మార్కెటింగ్ పరిధిలోకి తేవడంతో వీటి సంఖ్య 247కి చేరింది. అయితే ఈ-నామ్‌ను ఎప్పుడు ప్రభుత్వం ప్రారంభించింది?
**– 2016 ఏప్రిల్ 14**

❍ న్యూఢిల్లీలో జరిగిన 2025 158ఎఫ్ జూనియర్ ప్రపంచకప్‌లో పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన దేశం ఏది?
**– భారత్**

❍ నార్వేలో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో మహిళల 48 కిలోల విభాగంలో భారత వెయిట్‌లిఫ్టర్ మీరాభాయి చాను ఏ పతకం గెల్చింది?
**– వెండి**

❍ మహాత్మాగాంధీ సేవా పురస్కారానికి ఇటీవల ఎంపికైన వారు ఎవరు?
**– రామచంద్ర గుహ**

❍ ఇటీవల ఏ దేశంలో భారత యుపిఐ చెల్లింపు వ్యవస్థ ప్రవేశపెట్టారు?
**– ఖతర్** (ఇది 8వ దేశం) 1) యుఎఇ, 2) సింగపూర్ 3) భూటాన్, 4) నేపాల్, 5) శ్రీలంక, 6) ఫ్రాన్స్, 7) మాల్దీవులు

❍ వారసత్వ పరిరక్షణను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించడానికి ఒడిశా ప్రభుత్వం పూరీ జగన్నాథ ఆలయ రికార్డులను భద్రపరచడానికి ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీ పేరు ఏమిటి?
**– జ్ఞాన యజ్ఞ మండపం**

❍ భారతదేశపు మొట్టమొదటి జంతు జనన నియంత్రణ (ఎబిసి) శిక్షణ కేంద్రాన్ని ఏ నగరంలో ప్రారంభించారు?
**– లక్నో**

❍ ప్రపంచంలో బలమైన ఆర్థిక వ్యవస్థలో ఒకటైన జపాన్ ఆ దేశపు ప్రధానిగా మొట్టమొదటిసారి ఓ మహిళను ఎన్నుకునేందుకు చర్యలు చేపట్టింది. ఆ మహిళ ఎవరు?
**– గునై తకాయిచి**

❍ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్ళొచ్చిన తొలి భారతీయుడుగా గుర్తింపు పొందిన శుభాంశు శుక్లాను కేంద్ర విద్యాశాఖ ఏ కార్యక్రమానికి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది?
**– వికసిత్ భారత్ బిల్డ్‌థాన్ 2025**

❍ భారతదేశంలో మొదటి బాల్య వివాహ రహిత జిల్లాగా అవతరించిన బలోడ్ ఏ రాష్ట్రంలో ఉంది?
**– ఛత్తీస్‌గడ్**

❍ సహకార రంగంలో దేశ తొలి సిబిజీ (కంప్రెస్డ్ బయో గ్యాస్) ప్లాంట్ ఎక్కడ ఏర్పాటు చేసారు?
**– మహారాష్ట్రలోని అహల్యనగర్ జిల్లాలోని కొపర్గావ్‌లో**

**నోబెల్ ప్రైజ్ విజేతలు 2025**

❍ వైద్యం - మెరి ఇబ్రంకో ఫ్రెడ్ రామ్స్‌డెల్-అమెరికా, షిమోన్ సకగుచి (జపాన్) మానవ రోగ నిరోధక వ్యవస్థ పనితీరుపై.

❍ భౌతిక శాస్త్రం - జాన్ క్లార్క్, మిషెల్ డెకోరెట్ జాన్ ఎమ్ మార్టినిస్ (అమెరికా), పబ్ అటామిక్ టన్నెలింగ్.

❍ రసాయన శాస్త్రం - సుసుము కిటగవా (జపాన్), రిచర్డ్ రాబ్సన్ (ఆస్ట్రేలియా), ఒమర్ ఎమ్ యాగి (అమెరికా) మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్ వర్క్.

❍ సాహిత్యం - లాస్లో క్రస్న హెూర్కయి (హంగేరి), 2005లో మ్యాన్ బుకర్ ఇంటర్నేషనల్ ప్రైజ్, 2019లో నేషనల్ బుక్ అవార్డు

❍ శాంతి - మరియా కోరినా మచాడో (వెనుజులా) ప్రజాస్వామ్య హక్కుల పోరాటానికి.

❍ అర్థశాస్త్రం - జోయెల్ మోకిర్ (నెదర్లాండ్స్), ఫిలిప్ అఘియాన్ (ఫ్రాన్స్), పీటర్ హొవిట్ (కెనడా) (క్రియేటివ్ డిస్ట్రక్షన్)

❍ తల్లి నుండి బిడ్డకు హెచ్ఐవి, సిఫిలిస్, హెపటైటిస్-బి రోగాల కట్టడిని ఇటీవల ఏ దేశం సాధించింది?
మాల్దీవులు (ఈ ఘనత సాధించిన ప్రపంచపు తొలి దేశం)

# పచ్చదనం, పరిశుభ్రతతో సుస్థిరాభివృద్ధి- ఎంపీడీఓ

**మేజర్ న్యూస్ - చాగలమర్రి :** గ్రామాలలో పచ్చదనం- పరిశుభ్రతతోనే ప్రజలకు స్థిర అభివృద్ధి కలుగుతుందని ప్రగతికి పట్టుకొమ్మలైన గ్రామాలలో పచ్చదనం-పరిశుభ్రతతో ప్రజలందరూ మెలగాలని ఎంపీడీఓ తాహీర్‌హుసేన్ కోరారు. మండలంలోని శెట్టివీడు గ్రామంలో స్వచ్ఛా శెట్టివీడు కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే గ్రామంలోని ప్రకృతి సంపద కేంద్రం ఆవరణను శుభ్రపరచి చెట్లను నాటడంతో పాటు గ్రామంలోని రోడ్లను శుభ్రపరచి,రోడ్డుకు ఇరువైపుల ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం ఎల్ఎస్‌డిజీ థీమ్ 5 లో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్లు వాడటం, వ్యక్తిగత పరిశుభ్రత, ఇళ్లలో ఇంకుడు గుంతల నిర్మాణం, తడి, పొడి చెత్తను వేరు చేయడం,బహిరంగా మల విసర్జన లేకుండా ఉండటం, పరిసరాల పరిశుభ్రత, మురుగు కాలువల శుభ్రత, వర్మి కంపోస్ట్ తయారీ, ప్లాస్టిక్ వేస్టేజ్ను వేరి చేసి తరలించటం తదితర అంశాలపై ఎంపీడీఓ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు,మాజీసర్పంచ్ నరసింహారెడ్డి, పిఆర్ ఏఈ కొండారెడ్డి,ఈఓ తారకేశ్వరి,ఎంసీఓ రాజ్‌కుమార్,వివిధ గ్రామాల పంచాయతి కార్యదర్శులు,హరిత రాయబారులు పాల్గొన్నారు.



# వైసీపీ నాయకులను పరామర్శించిన సిద్ధార్థ రెడ్డి



**పగిడ్యాల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో వైసీపీ సీనియర్ నాయకులు చిన్న మాబు సాహెబ్ ను శుక్రవారం వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పరామర్శించారు . ప్రమాదవ శాత్తు గాయపడిన వజీర్ భాష, చిన్న మాబు సాహెబ్ ఇంటికి వద్దకు వెళ్లి ప్రమాదం జరిగినసంఘటనను అడిగి తెలుసుకున్నారు. రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయని నిత్యం ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకునే నాథుడు కరువయ్యారని చిన్న మాబు సాహెబ్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి వివరించారు. కొన్నాళు విశ్రాంతి తీసుకోవాలని,ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ పుల్యాల నాగిరెడ్డి, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ జబ్బార్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మల్లారెడ్డి, లక్ష్మాపురం వైఎస్ఆర్సిపి అధ్యక్షులు ఎం సి భాష, ఉస్మాన్ భాష, శ్రీకాంత్ నాయుడు, శశిధర్ గౌడ్, చంద్రపాల్, రాజమణి, రాజు, దేవేంద్ర, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప భక్తుల సంఘం మండలాధ్యక్షుడిగా పల్లె సుధాకర్‌నాయుడు



ఎన్నికైన సుధాకర్‌నాయుడు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్‌:** అఖిల భారత అయ్యప్ప భక్తుల సంఘం ప్యాపిలి మండల శాఖ అధ్యక్షుడిగా పల్లె సుధాకర్‌నాయుడిని నియమించినట్లు అఖిలభారత అయ్యప్ప భక్తుల సంఘం జాతీయ కార్యవర్గ కమిటీ అధ్యక్షుడు, అడ్వకేట్ వాంద్రాసి పెంచలయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన సుధాకర్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ నిత్యం అయ్యప్ప భక్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఎల్లప్పుడూ అఖిలభారత అయ్యప్ప భక్తుల సంఘం బలోపేతానికి కృషి చేస్తానని, తనను మండల శాఖ అధ్యక్షుడిగా నియమించిన జాతీయ కార్యవర్గ కమిటీ అధ్యక్షులు అడ్వకేట్ వాంద్రాసి పెంచలయ్యకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## గొర్రెల పెంపకందారుల సంఘం కో..ఆప్షన్ డైరెక్టర్‌గా ఎల్లరాజు

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్‌:** పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే కేఈ.శ్యాం కుమార్ ఆశీర్వాదంతో ఆంధ్రప్రదేశ్ గొర్రెల పెంపకందారుల సంఘం కోఆప్షన్ డైరెక్టర్‌గా మండలంలోని నర్సాపురం గ్రామానికి చెందిన ఎల్లరాజుయాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కర్నూలు జిల్లా చైర్మన్ కెఏ.శ్రీనివాసులు, వై.నాగేశ్వరరావుయాదవ్, రాష్ట్ర బీసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, జిల్లా వైస్ చైర్మన్, డైరెక్టర్ల ఆధ్వర్యంలో శుక్రవారం కర్నూలు నగరంలో ఎన్నుకోవడం జరిగింది. కో ఆప్షన్ మెంబర్‌గా వెల్దుర్తి శ్రీబ్రహ్మగుండేశ్వర గొర్రెలు, మేకల సొసైటీ అధ్యక్షులు కురువ రాజశేఖర్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



ఎన్నికైన ఎల్లరాజును సన్మానించిన సంఘం నేతలు

# మొండి బకాయిదారులపై కొరడా



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థకు పన్నులు చెల్లించకుండా మొండిగా వ్యవహరిస్తున్న దుకాణదారులపై నగరపాలక అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. యుకాన్‌ప్లాజా, అబ్దుల్లాఖాన్ ఎస్టేట్, కృష్ణనగర్, అబ్బాస్ నగర్ ప్రాంతాల్లో శుక్రవారం రెవెన్యూ విభాగ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. శుక్రవారం రూ. 15లక్షలు వసూలు చేసినట్లు ఆర్‌ఓ జునైద్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఓ స్వర్ణలత, వాజిద్, అర్‌ఐలు భార్గవ్, తిప్పన్న, కె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ టెలివిజన్ దినోత్సవం

**-ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్.ఎం.డి. ఫిరోజ్**

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** శుక్రవారం ప్రపంచటెలివిజన్ దినోత్సవం సందర్భంగా నంద్యాల టీవీ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. నంద్యాల జిల్లా టీవీ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నయ్య,నంద్యాల పట్టణ టీవీ టెక్నీషియన్స్ సంఘం అధ్యక్షులు జయపాల్,కార్యదర్శి వెంకట శివ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్.ఎం.డి.ఫిరోజ్, నంద్యా జిల్లా టీవీ టెక్నీషియన్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అతిథులుగా పాల్గొని ముందుగా టెలివిజన్ రూపకర్త బైర్డ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రభుత్వాసుపత్రి లో ఉన్న రోగులకు పండ్లు,బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్.ఎం.డి.ఫిరోజ్ రోగులను పరామర్శించి అందుతున్న చికిత్సల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎం.డి.ఫిరోజ్ మాట్లాడుతూ టీవీ టెక్నీషియన్స్ కు మెప్మా ఆధ్వర్యంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం పై శిక్షణ ఇప్పించడం జరుగుతున్నదని, అర్హులైన వారికి ఇండ్లు,ఇళ్ల స్థలాలు కేటాయించడానికి సహకరిస్తామన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ టెలివిజన్ సాంకేతికత నిరంతరం మార్పు చెందుతూ ఉంటుందని తదనుగుణంగా తమ పరిజ్ఞానాన్ని టీవీ టెక్నీషియన్స్ మెరుగుపరుచుకోవాలని, వినియోగదారుడికి నాణ్యమైన, నమ్మకమైన సేవలు అందించడం ద్వారా వృత్తిలో మంచి ఫలితాలు అందుతాయన్నారు. అసోసియేషన్ సభ్యుల సంక్షేమానికి సహకరిస్తామన్నారు. టీవీటెక్నీషియన్స్ రాష్ట్ర సంఘం కోశాధికారి రామకృష్ణ, నంద్యాల పట్టణ టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు పుల్లయ్య, గౌరవ సలహాదారు గోకారి, ఉపాధ్యక్షులు మహబూబ్ బాషా, సంయుక్త కార్యదర్శి ఎల్లా గౌడ్, కోశాధికారి వీరారెడ్డి, సహకోశాధికారి కిషోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.




# అనధికార నిర్మాణాలు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి

**– మున్సిపల్ కమీషనర్ రమేష్‌బాబు**
**– బిపిఎస్ స్కీంపై అవగాహన కార్యక్రమం**

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** ఆత్మకూరు పురపాలక సంఘం పరిధిలో అనధికారికంగా నిర్మించిన కట్టడాలు, పాట్ల క్రమబద్దీకరణ కోసం బిపిఎస్ స్కీం ద్వారా అవకాశం కల్పించడం జరిగిందని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పురపాలక సంఘం కమీషనర్ రమేష్‌బాబు, కుడా డబ్ల్యుపిఆర్ఎస్ కారుణ్యలత, పంచాయతీ సెక్రేటరి రాజశేఖర్‌లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయంలో బిపిఎస్ స్కీంపై సమావేశాన్ని నిర్వహించి కుడా డబ్ల్యుపిఆర్ఎస్ కారుణ్యలత, కరివేన పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, కమీషనర్ రమేష్‌బాబులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ ఆత్మకూరు పురపాలక సంఘం పరిధిలో 1-1-1985 నుంచి 31-08-2025 వరకు అనుమతులు లేకుండా నిర్మాణాలు, ప్లాట్లు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. అనుమతులు లేకుండా నిర్మించుకున్న కట్టడాల క్రమ బద్దీకరణకోసం బిపిఎల్ స్కీం ద్వారా అవకాశం కల్పించడం జరిగిందన్నారు. 12-11-2025 నుంచి 120 రోజులరోగ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని అక్రమంగా నిర్మించిన కట్టడాలు, ప్లాట్లను క్రమబద్దీకరించుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో టెక్నికల్ పర్సన్స్ ద్వారా లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు రిజిస్టర్ దస్తావేజులు, సబ్‌రిజిష్టర్ జారి చేసిన ఇసి, మార్కెట్ వ్యాల్యు కాపి, బిల్డింగ్ ప్లాన్, బిల్డింగ్ ఫోటో ఇతర సంబంధిత పత్రాలతో పాటు ప్రాథమిక ఫీజు రూ. 10వేలు చెల్లించి బిల్డింగ్ పినలైజేషన్ స్కీంలో భవనాలను క్రమబద్దీకరించుకోవాలన్నారు. దీని వల్ల భవనములకు చట్టభద్రత, అనధికార నిర్మాణాలపై విధించు దండన, కూల్చివేత, కేసులు లాంటి వాటి నంచి రక్షణ, ఇంటిపన్నుపై ఉన్న దీర్ఘకాలిక అనధికార అపరాధ రసుముల నుండి విముక్తి కలుగుతుందన్నారు. అలాగే బ్యాంకు నుంచి రుణాలు పొందుటకు అర్హత, భవన మార్కెట్ విలువ పెరుగుట, ప్లాన్ అప్రూవల్ పొందు సమయంలో మున్సిపాలిటికి మార్టిగేజ్ చేసిన స్థలం విడుదల, భవిషత్‌లో లీగల్ సమస్యల నుంచి రక్షణ పొందవచ్చున న్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని భవనాలు, ప్లాట్లను క్రమబద్దీకరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బిపిఎల్ స్కీంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# పేదల డాక్టర్ కలను ఛిద్రం చేస్తున్న కూటమి ప్రభుత్వం

**-మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిద్దాం**

**తుగ్గలి,మేజర్ న్యూస్:** డాక్టర్ కావాలన్న పేదవాడి కలను కూటమి ప్రభుత్వం ఛిద్రం చేస్తోందని , వైసిపి సీనియర్ నాయకులు గిరి గట్ల విష్ణువర్ధన్ రెడ్డి పనిభూషణ్ రెడ్డి శుక్రవారం రాత్రిగిరిగట్ల గ్రామంలో స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్సీపీ ప్రజా ఉద్యమంలో భాగంగా కోటి సంతకాలు, రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయాలన్న లక్ష్యంతో పాటు, ప్రజలకు సూపర్ స్పెషాలిటీవైద్యాన్ని అందించాలని భావించి, గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్మోహన్రెడ్డి 17 కొత్త ప్రభుత్వ మెడికల్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరణ చేసేందుకు ముందుకు రావడం సరికాదన్నారు. అందువల్ల ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రైవేటీకరణం చెందకుండా ఉండేందుకు ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉండాలని వారు తెలిపారు. వైసిపి నాయకులు కార్యకర్త పాల్గొన్నారు.



# అక్షరాస్యత అభివృద్ధికి అందరూ కృషి చేయాలి .. సూపర్‌వైజర్ జాకీర్

**తుగ్గలి,మేజర్ న్యూస్:** గ్రామీణ ప్రాంతాలలోనే అక్షరాస్య అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని వయోజన విద్య జిల్లా సూపర్వైజర్‌జాకీర్‌అన్నారు. శుక్రవారంఉపాధి హామీ కార్యాలయంలో ఎంపీడీవో విశ్వ మోహన్ అధ్యక్షతన ఉపాధి హామీ సిబ్బం దికి అక్షరాస్యత పెంపొందించేందుకు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సూపర్వైజర్ జాకీర్ మాట్లాడుతూఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ తమ గ్రామాల పరిధిలోనే ప్రతి ఒక్కరిని అక్షరాశులుగా చేసేందుకు రాత్రి వేళల్లో ప్రత్యేకంగా నిరక్షరాశులకు చదువు చెప్పాల ని ఆయన తెలిపారు. ఏపిఓ హేమ సుందర్, ఈసీ రాజశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్లు రామకృష్ణ, చంద్రశేఖ ర్, చిన్న అంజి, జయరాముడు, పరిదప్ప ఫీల్డ్ అసిస్టెంట్లు ,సీనియర్ మీటిలు పాల్గొన్నారు.




# రుద్రవరంలో పర్యావరణ పరిరక్షణపై శిక్షణ

**పాములపాడు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని రుద్రవరం గ్రామంలో పర్యావరణ పరిరక్షణ పచ్చదనం అభివృద్ధి పై మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 41 మంది గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులు రుద్రవరం గ్రామంలో 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ సంరక్షణ, పరిశుభ్రత, చెత్త సేకరణలో మెరుగుదలపై పై ఎంపీడీవో శిక్షణ ఇచ్చారు .కార్యక్రమంలో ఈ ఓ ఆర్ డి సులోచన, సర్పంచ్ రామస్వామి, సిబ్బంది, పాల్గొన్నారు.



సూర్య

శనివారం 22 నవంబరు 2025

# నమస్తే టీచర్..విద్యార్థుల నైపుణ్యాన్ని పరీక్షించిన కలెక్టర్

**– ఆకస్మీక తనిఖీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు**

**– ఎంఈఓ, హెచ్ఎంకు షోకాజ్ నోటీసులు**



విద్యార్థుల నైపుణ్యాన్ని పరీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నమస్తే టీచర్..విద్యార్థులు ఒక్క సారిగా తమ తరగతి గదికి కొత్త టీచర్ వచ్చిందేమోనని ఒక్కసారిగా లేచినిలబడి సెల్యూట్ చేశారు. తరువాత ఆ టీచర్ జిల్లా కలెక్టర్ రాజకుమారి అని విద్యార్థులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థినీ, విద్యార్థుల విద్యాభ్యాసం, నైపుణ్యం ఏవిధంగా పరీక్షించడానికి వారిని పలు ప్రశ్నలు వేశారు. శుక్రవారం పట్టణంలోని నందమూరినగర్‌లో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేయగా పలు విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. పాఠశాలలో విద్యార్థులకు సరైన వసతులు లేకపోవడం, మూడు రోజుల నుంచి విద్యార్థులు మెనూలో గుడ్లు ఇవ్వకపోవడం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం చూసి విస్తుపోయారు. విద్యార్థులు మరుగుదొడ్లు లేకపోవడంతో బయటకు వెళ్తున్నామని తెలిపారు. ఆగ్రహం చెందిన కలెక్టర్ ఎంఈఓ, హెచ్ఎంకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఈఓకు ఆదేశించారు. ఇప్పటికైనా పాఠశాలలో సమస్యలు తొలగుతాయో లేదో వేచి చూడాలి.

## ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించిన మంత్రి బి.సి




అర్జీలను స్వీకరిస్తున్న మంత్రి బి.సి

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారంనాడు బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి పలు విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితుల సమస్యలను అధికారులను దృష్టికి తీసుకెళ్లి త్వరిత గతిన పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ఎక్కువగా రెవెన్యూ సమస్యలు, ఫించన్‌లు, ఉద్యోగ ఉపాధి అవకాశాల వంటి సమస్యలు ఆయన దృష్టికి రాగా ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## శ్రీ చౌడేశ్వరీ అమ్మవారికి పల్లకీ సేవ



పల్లకిసేవ దృశ్యం

**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్ః** శుక్రవారం పురస్కరించుకొని ఆలయంలో శ్రీ చౌడేశ్వరీదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో పూజించి పల్లకిపై కూర్చొనబెట్టి, ప్రధాన ఆలయం చుట్టూ పల్లకి సేవను నిర్వహించారు. ఈ పల్లకిసేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈ.ఓ శ్రీనివాస రెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా..

**ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి**

**డోన్, మేజర్‌న్యూస్ః** ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వచ్చిన ప్రతి వినతులు ఎమ్మెల్యే కోట్ల క్షుణ్ణంగా పరిశీలించి, అందుకు సంబందించిన అధికారులతో అప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ ప్రజలు ఎప్పుడైనా వారు ఎదుర్కునే సమస్యలను తనకు తెలియజేసేందుకు తనను సంప్రదించవచ్చని, వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ప్రజలకు భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అహోబిలం భద్రత బలోపేతం

**-సంయుక్త సమీక్షలో కీలక నిర్ణయాలు**



సంయుక్త సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్పి ప్రమోద్

**ఆళ్లగడ్డ,మేజర్‌న్యూస్ః** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం ఆలయాల భద్రతకు సంబంధించి శుక్రవారం పోలీస్ శాఖ, అహోబిలం మఠంఅధికారులు, అటవీశాఖ అధికారులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఆళ్లగడ్డ డి.ఎస్.పి. ప్రమోద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో భక్తుల భద్రత, దేవాలయ భద్రతను మరింత బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా జరిగింది. సమీక్షలో భాగంగా అన్ని శాఖల అధికారులు కలిసి ప్రస్తుతం అమల్లో ఉన్న భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, అహోబిలం పవిత్రక్షేత్రానికి వచ్చే వేలాది మంది భక్తులకు పూర్తి భద్రత కల్పించేందుకు పలు చర్యలను చర్చించారు. సీసీటీవీ పర్యవేక్షణ, 24/7 నిఘా, ఆలయ దర్శనానికి వచ్చే భక్తుల లగేజీ, మొబైల్ ఫోన్లను ఉంచుకొనేందుకు ప్రత్యేక క్లాక్ రూమ్ ఏర్పాటు చేయాలని, ఆలయం లోపల ముఖ్య ప్రదేశాల్లో ఫైర్ ఎక్స్టింగ్విషర్లు, ఫస్ట్-ఎయిడ్ కిట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు డిఎస్పి ప్రమోద్ తెలిపారు. దేవాలయ స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్న విలువైన ఆభరణాలు, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆభరణాలు అత్యాధునిక అలారం వ్యవస్థతో రక్షించేబడే విధంగా అలాగే స్ట్రాంగ్ రూమ్‌ను తెరవడానికి ఏదైనా ప్రయత్నం జరిగిన వెంటనే సైరన్ మోగి, దేవాలయ మేనేజర్ మరియు పీఠాధిపతికి వెంటనే అలర్ట్ సందేశాలు పంపబడే విధంగా వ్యవస్థ అమలుచేయబడుతుందన్నారు. అత్యవసర సంప్రదింపు నంబర్లుగా అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ, జంతు రక్షణ బృందం, దేవాలయ నిర్వహణ ఫోన్ నంబర్లను భక్తులకు కనిపించే ప్రధాన ప్రదేశాల్లో ఏర్పాటుచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. భక్తుల రక్షణ మరియు దేవాలయ ఆస్తుల సంరక్షణ కోసం ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో దేవాలయం మేనేజర్ సుందరరాజన్, ఆళ్ళగడ్డ రూరల్ సీఐ మురళీధర్ రెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మర్తుజావలి మరియు సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలోనే రైతన్నలకు చేయూత



పీఎం, సీఎం, డిప్యూటీ సీఎంలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** కూటమీ ప్రభుత్వం తోనే రైతన్నలకు చేయూత ఉంటుందనిఎమ్మిగనూరుఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని రైతు సేవా కేం ద్రం దగ్గర పీఎం నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల చిత్రపటాలకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి క్షీరాభిషేకం నిర్వహించారు. గత నెలలో అధిక వర్షాల కారణంగా నష్టపోయిన గాజులదిన్నె, గంజహళ్లి, ఐరన్బండ గ్రామాల రైతులకు ఉచితంగా మినుములు పంపిణీ చేశారు. ఒక్కొక్క రైతు కు ఉచితంగా ఎకరంకు 8 కేజీల ప్రకారం పంపినీ చేశారు. ఈ మూడు గ్రామాలకు 1200 కిలోల మినుములను ప్రభుత్వం విడుదల చేసింది. మండలంలో పీఎంకిసాన్, రెండవ విడత నిధులు 11394 మంది రైత లకు రూ.8.25 కోట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రకృతి వ్యవసాయం వారు ఏర్పాటు చేసిన స్టాల్స్ న్ను బీవీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూ. 2వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 5వేలు మొత్తం ఏడు వేలరుపాయలు రైతుల ఖాతాలు జమ అయ్యాయని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం కూటమి నేతలు మాట నిలబెట్టుకున్నారని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ మహుమ్మద్బద్రీ. ఏవో హేమలత, సర్పంచ్ హైమావతి, తిరుపతయ్యనాయుడు, రామాంజినేయులు, జనసేన నాయకులు గానుగబాషా, మాలిక్ బాషా, బీజేపీనాయకుడు మునిస్వామి పట్టణ అధ్యక్షుడు మహల్ రహంతుల్లా, మాజీ పట్టణ అధ్యక్షుడు రమేష్నాయుడు, అడ్వకేట్ చం ద్రశేఖర్, మురళీనాయుడు, నూరహమ్మద్, కాంట్రాక్టర్ షెక్షావలి, గౌండ రహంతుల్లా, డాక్టర్ మిన్నల్ల, రంగస్వామినాయుడు, మేకల మునెప్ప, పాల్గొన్నారు.

# శారీరక మానసిక వికాసానికి క్రీడలు ఎంతో అవసరం

**– రీజనల్ స్పోర్ట్స్ కల్చరల్ ఫెస్ట్ ఇంటర్ పాఠశాలల క్రీడలు**

**– మంత్రి ఎన్ఎండి ఫరూక్**



విద్యార్థినులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న మంత్రి ఫరూక్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల ఆవరణంలో రెండు రోజుల పాటు జరిగే రీజనల్ స్పోర్ట్స్ కల్చరల్ ఫెస్ట్ శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. విద్యార్థులలో క్రీడా స్ఫూర్తిని, సాంస్కృతిక ప్రతిభను వెలికితీసేందుకు ఉద్దేశించిన ఈ ఫెస్ట్ నవంబర్ 21,22 తేదీలలో నిర్వహించబడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరై ఇంటర్ స్కూల్ క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల నుంచి ప్రాంతీయ స్థాయిలో వివిధ పాఠశాలల నుంచి ప్రతిభావంతులైన విద్యార్థులు ఈపోటీలలో పాల్గొనున్నారు. ఈరెండు రోజుల్లో ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్, డ్యాన్స్ కాంపిటిషన్ నిర్వహించబడతాయని నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ క్రీడలు, కళల పట్ల విద్యార్థులను ప్రోత్సహించడం వారి శారీరక, మానసిక వికాసానికి ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలని సూచించారు. పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆయన ట్రోఫీలు, పతకాలు, ప్రశంసా పత్రాలు మంత్రి అందజేశారు. ఈకార్యక్రమంలో రీజనల్ సుపీరియర్స్ సీనియర్స్ జాక్యలీన్, కరస్పాండెంట్ సీనియర్ అనిజెసింతా, రెవరెండ్ ఫాదర్ జోసఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

**-మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు**



అర్జీలను స్వీకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** ప్రజల సమస్యలను పరిష్కరించడానికే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆదోని నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు శుక్రవారం ఆదోని పట్టణంలోని ఆయన నివాసంలో ఆదోని నియోజకవర్గ స్థాయి ప్రజా దర్బార్ ను వారు నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజల నుంచి పలు సమస్యల అర్జీలను ఆయన స్వీకరించారు. ప్రధానంగా ఆయా గ్రామాల్లోవీధిలైట్లు,త్రాగునీటి సమస్య, శానిటేషన్, రోడ్లు, రెవెన్యూ, ఇంటి స్థలాలు, విద్యుత్ సమస్యలు వంటివి అందులో ఉన్నాయి. ప్రజల వినతులను స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడులు వెంటనే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజల అభివృద్ధి వారి సంక్షేమమే కూటమి ప్రభుత్వం ఏకైక లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శివప్ప, టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణ, ఆయా గ్రామాల ప్రజలు, టిడిపి నాయకులు,